# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో 70 శాతం రిజర్వాయర్లు నీటితో నిండాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ అనకాపల్లి జిల్లా అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు మరణించారు.
- ❖ నూతన పరిశ్రమలు ఏర్పాటుతో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీన గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లో త్వరలో టెక్స్ టైల్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు నూతన విధానాన్ని తీసుకురానున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు.

==========================

రాష్ట్రంలో 70 శాతం రిజర్వాయర్లు నీటితో నిండాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా సోమశిల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... 20 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో ఆగస్టు నెలలోనే రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నా యన్నారు. రైతులకు సకాలంలో సాగు నీటిని అందిస్తే పంటలు బాగా పండుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం రిజర్వాయర్లలో 983 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చని... ఇప్పటి వరకు 692 టీఎంసీలు నిల్వ చేసుకున్నామని వెల్లడిస్తూ.....

(వాయిస్ 36 సెకన్లు)

==========================

అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు మరణించారు. అనకాపల్లి జిల్లా, కోటవురట్ల మండలం కైలాస పట్టణంలో జరిగిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న వారిలో నలుగురు విద్యార్థులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనకు గల కారణాలపై పూర్తి నివేదిక అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన చిన్నారులకు ప్రస్తుతం కేజీహెచ్ లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. అనకాపల్లి స్థానిక ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్ లో చేర్పించిన చిన్నారులను ఈరోజు కలెక్టర్ పరామర్శించారు. మొత్తం 14 మంది పిల్లలు అనకాపల్లి నుంచి వచ్చారని వారందరికీ ప్రస్తుతం పిల్లల వార్డులో వైద్య నిపుణుల పర్యవేక్షణలో మెరుగైన వైద్యం అందుతోందని పేర్కొన్నారు. అందరి పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

==========================

రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఈరోజు ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో 3 వేల 683 కోట్ల రూపాయలతో 16 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, 8 పరిశ్రమలకు భూమి పూజ, 5 కొత్త సంస్థల ప్రతిపాదనల ఒప్పందాలపై ఆయా కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉందని, పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి నూతన పరిశ్రమలను తీసుకువస్తున్నామని తెలిపారు.

==========================

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీన గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై ఈ రోజు రాష్ట్ర సచివాలయం నుంచి అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపారు. ఉపాధి హామీ పథకం అమలుకు అధికారులు బాధ్యత వహించాలని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

==========================

రాష్ట్రంలో త్వరలో టెక్స్ టైల్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు నూతన విధానాన్ని తీసుకురానున్నామని జౌళి, వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు పెట్టుబడుదారులతో మంత్రి దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నూతన పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. త్వరలో నూతన టెక్స్ టైల్, అపెరల్, గార్మెంట్స్ పాలసీ తీసుకురానున్నామని, ఇందుకోసం మౌలిక వసతుల కల్పనతో పాటు రాయితీలు కూడా అందించనున్నామని తెలియజేశారు. దేశంలో సిల్క్ ఉత్పత్తిలో ఆంధ్ర ప్రదేశ్ 2 స్థానంలో, కాటన్ ఉత్పత్తిలో 6 స్థానంలో, జనపనార ఉత్పత్తిలో 7వ స్థానంలో ఉందని మంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో 9 టెక్స్ టైల్, అపెరల్ పార్కులున్నాయని మంత్రి సవిత పేర్కొన్నారు.

==========================

మారుమూల గ్రామాల నుండి వచ్చే అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టి.నిషాంతి అధికారులకు సూచించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అర్జీ దారుల నుండి సుమారుగా 126 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో వివిధ రకాల సమస్యలతో వచ్చే అర్జీదారుల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

==========================

దివ్యాంగుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి 6 వీల్ చైర్స్ పంపిణీ చేయడం జరిగిందని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా పేర్కొన్నారు. ఈ రోజు కలెక్టరేట్ ఆడిటోరియంలోని "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఆరుగురు దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేశారు. దివ్యాంగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందజేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==========================

క్రీడలతో శ్రీకాకుళం జిల్లాకు ఒక ప్రత్యేక అనుబంధం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడల ముగింపు వేడుకల్లో ఈరోజు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని విజేతలకు అభినందనలు తెలియజేశారు. జిల్లాలో అన్ని క్రీడలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించాలని, 2028లో రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులకు రైల్వే శాఖ ఇచ్చిన 75 శాతం రాయితీ తిరిగి పునరుద్దరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నేటి యువత క్రీడలపై ఆసక్తి చూపేలా, మానసికంగా, శారీరకంగా తీర్చిదిద్దడంతో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

==========================

ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ ఈఎస్ఐ ఆసుప్రతి ప్రాంగణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈరోజు ప్రారంభించారు. నూతన భవనంతో పాటు ప్రయోగశాలలు, డయోగ్నస్టిక్, సెంటర్లను కూడా మంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వం హయాంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు

==========================

మచిలీపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా 160 కోట్ల రూపాయలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 33 కోట్ల రూపాయలతో గ్రామీణ ప్రాంతాలలో రహదారులు, స్మశానవాటికల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణాన్ని అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి టిడ్కో ఇళ్లు అందిస్తామని అన్నారు. అమృత-2

ఫేజ్ కింద ప్రతి గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తునామని అందుకోసం కేంద్ర ప్రభుత్వంకు 115 కోట్ల రూపాయల అంచనాలు పంపించగా ఆమోదం తెలిపారని వెల్లడించారు.

==========================

గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 185వ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో జరిగే అనేక సంఘటనల గుర్తింపుకు ఒక అస్త్రంగా ఫోటోగ్రఫీ పని చేస్తోందని పేర్కొన్నారు.

==========================

==========================